యువతకు దిక్సూచి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థిని

- నిరుద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న బొల్లినేని మెడ్‌స్కిల్స్
- వైద్య విభాగంలోని పలు అంశాల్లో యువతకు శిక్షణ.. ఉపాధి
- విద్యార్థుల మార్కులతో పని లేకుండా ప్రోత్సాహం.. దిశా నిర్దేశం

అక్కిరెడ్డిపాలెం: **పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు** చదివి, తక్కువ **మార్కులు సాధించి ఇక తమకు** ఎటువంటి ఉద్యోగాలు రావని నిరుత్సాహ పడుతున్న నిరుద్యోగ యువతకు షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ భరోసా కల్పిస్తోంది. వారి అర్హతను బట్టి పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.

యువతకు భరోసా..

నిరుద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఇనిస్టిట్యూట్ నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో శిక్షణ, అనంతరం ఉపాధి కల్పిస్తూ ఎంతో మంది యువతకు భరోసా కల్పిస్తోంది. శిక్షణా కాలంలో వారికి ఆహారం, వసతి కల్పించి ఆసరాగా నిలిస్తోంది. శిక్షణా కాలంలో వారి ఆర్థిక **పరిస్థితిని బట్టి ఫీజు వసూలు చేయకుండా** వారికి ఉపాధి కల్పించిన తర్వాత వారు అందుకునే జీతంలో నుంచి ఫీజు వసూలు చేయడం గొప్ప విషయం అని చెప్పాలి. శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జీఈఎంఎస్ ఆస్పత్రి, ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా 2016 జనవరి నుంచి ఈ కోర్సులకు కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల్లో కూడా ఈ విధమైన ఉపాధి మార్గాలకు శ్రీకారం చుట్టారు.

వేలాది మందికి శిక్షణ.. ఉపాధి..

బొల్లినేని మెడ్‌స్కిల్స్ కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు వైద్య రంగంలో వేలాది మందికి శిక్షణ ఇవ్వాలనే ఆలోచనతో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఏర్పాటు చేశారు. బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఆకుంఠిత దీక్షతో నిరుద్యోగ యువతకు ఎప్పటికప్పుడు వైద్య రంగంతో పాటు వారికి అవసరమైన ఇతర కోర్సుల్లో సైతం అడ్మిషన్లు కల్పించి వారి విద్యార్హతకు తగ్గ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ సేవలకు గాను సంస్థ ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవల పురస్కారం అందుకుంది.



హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ఏ విధమైన వైద్యం అందించాలనే శిక్షణలో విద్యార్థినులు

కోర్సు పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు..

బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం డిగ్రీ స్థాయిలో బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు నిర్వహిస్తోంది. కోర్సు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు ప్రభుత్వ శాఖల్లోనే కాకుండా దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఇంటర్ బైపీసీ కోర్సు చేసిన విద్యార్థులకు సువర్ణ అవకాశం. బొల్లినేని మెడ్‌స్కిల్స్ టెక్ మహేంద్ర సహకారంతో 2 కోర్సులను నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రెండవ అంతస్తులో నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువతకు అవసరైన బేకరీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ కల్పిస్తోంది. ద్వారకానగర్ వద్ద మరో 5 కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీలో సైతం అర్హత గల యువతకు అడ్మిషన్లు కల్పిస్తోంది.



జనరల్ డ్యూటీ విధుల్లో ట్రైనింగ్ అవుతున్న విద్యార్థులు

హెల్త్ కేర్ బిల్లింగ్ కోర్సులు..

డిగ్రీ పాసైన యువతకు 4 నెలల కాల వ్యవధి గల మెడికల్ టెర్మినాలజీ, అబ్రివేషన్స్, అవుట్ పేషెంట్ (ఓపీ), బిల్లింగ్ ప్రాసెస్, ఇన్ పేషెంట్ (ఐపీ) బిల్లింగ్ ప్రాసెస్, క్యాష్ అండ్ ఇన్సూరెన్స్ బిల్లింగ్ ప్రాసెస్, సాఫ్ట్‌వేర్ యాక్సిస్ (హెచ్ఐఎంఎస్), బేసిక్ కంప్యూటర్ నాలెడ్జి (ఎంఎస్ ఆఫీస్), వర్క్ ప్లేస్ రెడినెస్, సాఫ్ట్ స్కిల్స్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి కోర్సులతో పాటు పలు రకాల కొత్త కోర్సులు అందిస్తూ శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.



వైద్య విభాగంలో నాడీ వ్యవస్థపై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులు..

ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన యువతకు 4 నెలల కాలంలో మెడికల్ టెర్మినాలజీ, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, పేషెంట్ కేర్ సర్వీసెస్, ల్యాబ్ డిమాన్‌స్ట్రేషన్, ప్రథమ చికిత్స, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ (ఎంఎస్ ఆఫీస్), వర్క్ ప్లేస్ రెడినెస్, సాఫ్ట్‌స్కిల్స్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి వాటిలో తర్ఫీదు ఇస్తోంది.



హెల్త్‌కేర్ బిల్లింగ్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం..



షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా మా ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

– సీహెచ్ నాగేశ్వరరావు, బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

క్లుప్తంగా

పెదశేష వాహనంపై ఊరేగిన తిరుమలేశుడు



శ్రీవారి పెదశేష వాహన సేవలో పాల్గొన్న ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి పెదశేష వాహన సేవను దివ్యక్షేత్రం మాడవీధుల్లో అశేష భక్త జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు పెదశేష వాహన సేవలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. దివ్య క్షేత్రం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి.

ఒకరి రక్తదానం ఇద్దరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) రక్తదాన శిబిరం నిర్వహించింది. గురువారం ఆటోనగర్ ఐలా సహకారంతో శిబిరం నిర్వహించారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ఇద్దరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. 40 మంది వరకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, బి.ప్రభాకర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణకు రూ.25 వేల విరాళం



ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం జరిగే అన్న ప్రసాద వితరణకు దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. గురువారం సత్తివానిపాలేనికి చెందిన సతివాడ కనకరాజు, ఇందిర దంపతుల కుమారుడు చంద్రశేఖర్ రూ.25 వేల విరాళం దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ మానవ వికాస్ వేదిక, మానవతా, లయన్స్‌క్లబ్ స్టీల్‌సిటీ, అగనంపూడి, కూర్మన్నపాలెం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ప్లాట్‌ఫామ్ ఒకటి వైపునున్న లాన్, ఇతర పరిసరాల్లో చెత్తా, పిచ్చిమొక్కలు తొలగించారు. మధ్యాహ్నం 450 మంది సాధారణ, మహిళా, దివ్యాంగ రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందించారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, పీకే ఎం లక్ష్మి, జాషువా, గుదే సుశీలా గజేంద్రరావు, కామేశ్వరరావు, బోసుబాబు, బుచ్చిరాజు, ఆదిల్ రెహ్మాన్, హనుమంతరావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)కి విచ్చేసిన అఖిలభారత బీఎంఎస్ కార్మిక సంఘం నాయకులు హిరణ్మయ్ పాండ్య జేడేవ్‌ను సంస్థ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు కలిశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు విశాఖపట్నం యూనిట్‌లో సంస్థ ఉద్యోగులు, కార్మికుల పీఎఫ్ సంబంధిత అంశాలపై ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ భెల్ విశాఖ యూనిట్ ఉద్యోగులందరి పూర్తి వేతనాలపై హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు తిరస్కరించబడ్డాయన్నారు. పీఎఫ్ కమిషనర్ కార్యాలయం చెప్పిన ప్రకారం అన్నింటికి భెల్ పీఎఫ్ ట్రస్ట్ మాత్రమే బాధ్యత వహించాలని విన్నవించుకున్నాం అన్నారు. భెల్ విశాఖపట్నం యూనిట్‌లో పర్మినెంట్ కాబడ్డ కార్మికులకు సంబంధించిన పెన్షన్ పథకంలో చేరిన తేదీలు పీఎఫ్ ఆఫీసు రికార్డుల్లో తప్పుగా నమోదయ్యాయి అన్నారు. దీనివల్ల వందలాది మంది కార్మికులు లక్షలాది రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం పీఎఫ్ ట్రస్ట్ గౌరవ సభ్యులైన పాండ్య కలగజేసుకుని భెల్ కార్మికులకు న్యాయం చేయాలని, పీఎఫ్ అనేది కేవలం భవిష్యత్తు భద్రత కోసం ఏర్పడినా ఈ పథకం పొందడంలో కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని తొలగించాలని కోరుతున్నామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పాండ్య అధికారులతో చర్చిస్తామన్నారు. అనంతరం యూనియన్ నాయకులు పీఎఫ్ సమస్యపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.టి.పి.ప్రకాష్, సీహెచ్ సీతన్నాయుడు, వారాడ ఆనందరావు, వీఎస్ మూర్తి, పొన్నా శివరాం, జి.అచ్చిన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



హిరణ్మయ్ పాండ్య జేడేవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు

కూటమి పాలనను ఎండగట్టాలి

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ పాలనను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ ఎస్సీ సెల్ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలపై పోరాటాలు చేయాలన్నారు. గాజువాక నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరాజు, గంగుకూరి రోజారాణి, కటికల కల్పన, కొల్లి దేవుడు, వెంకటేష్, ఉమ, కనకరాజు, శ్రీను, సురేష్, రాజేష్, రాము, పిట్టా రెడ్డి, ప్రభాకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

రాజ్యాంగంతోనే అందరికీ సమాన హక్కులు

ఉక్కునగరం: దేశంలో హక్కులు నిరాకరించబడిన సమాజంలో మొట్టమొదటి సారిగా సమానత్వ హక్కుల కల్పనకు మొట్టమొదటి లీగల్ డాక్యుమెంట్ భారత రాజ్యాంగం అని నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగం జీఎం ఎస్. రమణారావుకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సన్మాన గ్రహీత రమణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన యాజమాన్యం, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ అంబేడ్కరీయులు బూలా జగ్జీవన్‌రామ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆర్. సత్యనారాయణ, జి. బోసు బాబు, ఠాగూర్, కె. రవిశేఖర్, కె. సంజీవరావు, డి. వసంతరావు, డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, మాటూరి శ్రీనివాసరావు, ఎల్.వి. రమణారావు, పెద్దిరాజు, బత్తుల శ్రీనివాసరావు, కె.ఎల్ నరసింహం, జి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జీఎం రమణారావును సత్కరిస్తున్న డీసీపీ సత్తిబాబు, నాయకులు

అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులోకి బుధవారం రాత్రి ఒక్కసారిగా పోలీసులు నల్ల దుస్తులతో ప్రవేశించారు. దీంతో ఉద్యోగులంతా అవాక్కయ్యారు. వారి చేతుల్లో ఉన్న ఆయుధాలు చూసి భయపడిపోయారు. అనంతరం అది మాక్‌డ్రిల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. అదానీ గంగవరం పోర్టులో బుధవారం రాత్రి నిర్వహించిన మాక్‌డ్రిల్ అబ్బురపరిచింది. విశాఖపట్నం ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.రాజారెడ్డి ఆధ్వర్యంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ శ్యామ్ సహకారంతో ముందుగా పోర్టులోని ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఉగ్రవాదుల దాడులను ఎలా ఎదుర్కోవాలనే అంశాన్ని వివరించారు. అనంతరం ఆయుధాలతో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూపోర్టు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



అదానీ గంగవరం పోర్టులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

అందరి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న జెడ్సీ శేషాద్రి, కార్పొరేటర్ స్టాలిన్



వీఎస్ఈజెడ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న రోషిణీ అపరంజీ కొరారీ



నెల్లిముక్కు మైదానంలో మొక్కలు నాటుతున్న పులి లక్ష్మీబాయి తదితరులు

గాజువాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 72వ వార్డులోని విద్యానగర్ పార్కులో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పర్యావరణ పరిరక్షణలో విశాఖ నగరం మూడో స్థానంలో ఉందన్నారు. పచ్చదనాన్ని పెంపొందించి మొదటి స్థానం కోసం కృషి చేయాలని కోరారు. విరివిగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు జి.ఆనంద్, బి.సత్యనారాయణ, ఎం.ఎ స్.ఎస్.మూర్తి, లక్ష్మణరావు, కన్నారావు, సాలాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన న్యాయమూర్తులు..

పర్యావరణ దినోత్సవం సందర్భంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయమూర్తులు ఎం.వి.శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి డి.చిరంజీవి, న్యాయవాదులు ఎ.మురళీమోహనరావు, గిల్బర్ట్, సీతామహాలక్ష్మి, కోర్టు పరిపాలనాధికారి ఆర్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కూర్మన్నపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలనగర్‌లో 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్ చిల్డ్రన్ పార్కులో మొక్కలు నాటారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘ పెద్దలు, నాయకులు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నివారించాలని, గుడ్డ సంచులు వాడాలని భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు తవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ కార్యదర్శులు సంధ్య, నీలిమ, లలిత, మలేరియా విభాగం సిబ్బంది, నరేష్, వార్డు పెద్దలు సన్యాసిరావు, పరమానంద్, విశ్వేశ్వరరావు, కామరాజు, చిట్టిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు కాంప్లెక్స్‌లో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



వేడుకలు ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

నెల్లిముక్కు మైదానం.. భవిత కేంద్రంలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు మైదానంలో గురువారం కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పులి రమణారెడ్డి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. భవిత కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర సభ్యురాలు జీలకర్ర భువనేశ్వరి మొక్కలు నాటారు. నాయకులు జీలకర్ర రమణ, తులసీదాస్, ఎస్. ఉమామహేశ్వరరావు, లక్ష్మీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఈ–బ్లాక్‌లో..

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఈ–బ్లాక్‌లో మొక్కలు నాటారు. అధికారులు సురేష్, ఐలా కమిషనర్ కిషోర్, చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పద్మావతి, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, బి.ప్రభాకర్ కుమార్, శ్రీను, వీరయ్య, రేవతి, సుబ్బారావు, వర్మ, మహావీర్, అపర్ణ, పవన్, జ్యోతి పాల్గొన్నారు.

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో..

అగనంపూడి: వీఎస్ఈజెడ్ ఆవరణలో దువ్వాడ వీఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణీ అపరంజి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ అధికారులు, వివిధ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. మొక్కలు నాటారు.

- దువ్వాడ సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్ఎస్‌రాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కంపెనీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాంకీ ఫార్మాసిటీలోని అలివిరా ఆనిమల్ హెల్త్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు అనిమిరెడ్డి దేముడు మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ బాబు, కంపెనీ ప్రతినిధులు రామరాజు, శివరామకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- 85వ వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు శివాజీ, లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ కిడిమి హనుమంతరావు, పొడుగు వరహాలు, అండిబోయిన అప్పారావు, అప్పలరాజు, సీతిన అప్పలరాజు పాల్గొన్నారు.
- వార్డులోని అగనంపూడి సెక్టార్–1 జాతీయ రహదారి పక్కనున్న దేవాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, మరుగుదొడ్ల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, కొరాయి నాగార్జున, కోసూరి తాతారావు, మంగరాజు, కోటేశ్వరరావు, ఈశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.
- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.
- 79వ వార్డు అగనంపూడి కూడలిలో మహాత్మా గాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.



లంకెలపాలెం హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న హెచ్ఎం తదితరులు

పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ అధిక ప్రాధాన్యం..

ఉక్కునగరం: పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఉక్కు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఉక్కు ఎంపీ హాలులో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులకు గ్రీన్ అవార్డులు ప్రదానం చేశారు. డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం, జి. పురుషోత్తమన్, సీజీఎం (వర్క్స్) ఆర్. మహంతి పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విభాగాధిపతులు, ఉన్నతాధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు హెచ్‌ఆర్ విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతిగా మధుసూదనరావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో కలిసి శాలువా కప్పి, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ యాజమాన్యం, కార్మికులు కలిసి కట్టుగా పని చేస్తే కర్మాగారం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, బి. శశిభూషణరావు, జి. అప్పలరెడ్డి, నమ్మి ప్రసాద్, పి. కనకరాజు, తిప్పల గుర్నాథరెడ్డి, కర్రి శ్రీనివాస్, అట్టా శ్రీనివాస్, జి. లక్ష్మణరావు, జి.టి. మూర్తి, ఎస్.ఎ. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కార్మిక, చేనేత, నైపుణ్యాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. గురువారం నాయకులు హైదరాబాద్‌లో స్టాండింగ్ కమిటీ నాయకులను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్టాండింగ్ కమిటీ సభ్యులు స్పందించి త్వరలో ఢిల్లీలో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్లు సీహెచ్ నర్సింగరావు, డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కాంట్రాక్ట్ లేబర్ నాయకులు నమ్మి రమణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంటరీ కమిటీ ఎంపీలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు